

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 14 ఫిబ్రవరి 2023 పేజీలు : 04

# పెద్దపప్పూరు మండలంలోఇసుక అక్రమాలను నిరూపిస్తా

## - లేదంటే నగరం నుంచి బహిష్కరణ చేయండి : జెసి ప్రభాకర్‌రెడ్డి

**అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో**

పెద్ద పప్పూరు మండలంలో ఇసుక అక్రమాలను చూడటానికివెళ్తే నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసులు నమోదు చేశారని ఆయన వాపోయారు. అసలు అక్కడ ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాల్సి న అవసరం ఉందన్నారు. ఇసుక అక్రమాలను గురించి ఈ సందర్భంగా సోమవారం ప్రెస్ మీట్‌ఏర్పాటు చేసి తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను మనుషులతోనే రోజుకు 20 మంది చొప్పున తవ్వాలని, 300 రోజులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే లోడింగ్ చేయాలన్నారు. ఒక రోజుకు వీరికి 75 ట్రాక్టర్లు, లేదా 15 టిప్పర్లుమాత్రమే తోలుకోవాలన్నారు. కానీ అక్కడ మాత్రం 200 హెచ్‌పి సామర్థ్యంకగల ఐదు మిషన్లతో రాత్రింబవళ్లుపని చేస్తున్నాయన్నారు. 200 టిప్పర్లు, 80 ట్రాక్టర్లు లోడింగ్ చేస్తున్నాయన్నారు. పెన్నానదిలో 23 టన్నుల ఇసుకను 8500 రూపాయలు వసూలు చేస్తున్నారని, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి 16 నుంచి 40వేల వరకు దండు కుంటున్నారన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి చాల మంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడ రైతులు ఈ పరిస్థితి చూసి ఆత్మహత్యలు చేసుకుంటామంటున్నారని, నేను కూడా వారితోపాటు వెళ్లి నీటిలో దుంకుతా అన్నారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన సాక్షాలు అంటూ పత్రాలను చూపించారు. పర్మీషన్లు ఒక చోట ఉంటే మరోచోట తవ్వుతున్నారన్నారు.

# వైసిపి, బిజెపి హయాంలో అభివృద్ధికి నోచుకోని సాగునీటి ప్రాజెక్టులు

**- పోలవరానికి నిధులివ్వకుండా మొండికేసిన కేంద్రం - ఎన్నికల లబ్దికోసమే అప్పర్‌భద్రాకు 5,300 కోట్లు - అప్పర్‌భద్రా నిర్మిస్తే రాయలసీమ ఎడారికాక తప్పదు - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**



తుంగభద్ర రిజర్వాయర్, హెచ్‌ఎల్‌సి కాలువ పనులు పరిశీలిస్తున్న సిపిఐ నేతల బృందం



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



**అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో**

**గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఒక్క నీటి ప్రాజెక్టు కూడా అభివృద్ధికి నోచుకోలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఏపి సాగునీటి ప్రాజెక్టులపై 8 రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రామకృష్ణ నేతృత్వంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కర్ణాటక రాష్ట్రం తుంగభద్ర రిజర్వాయర్‌ను పరిశీలించారు.**

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు సక్రమంగా నిధులు కేటాయించడం లేదని తద్వారా ఏ ఒక్క ప్రాజెక్టు పనులు పూర్తి కావడం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించేదేకానీ నిధులు కేటాయించకుండా జాప్యం చేస్తోందని మండి పడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయి నర్వాసితులకు సైతం పరిహారం అందలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్లుగా గోరుచుట్టు మీద రోకలి పోటులా కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తోందని ఏకరువు పెట్టారు. అప్పర్‌భద్ర నిర్మాణం జరిగితే ఏపిలో త్రాగునీరే కాకుండా లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అప్పర్ భద్రకు నిధులు కేటాయించి ఎపికి అన్యాయం చేశారని బిజెపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇప్పటికే రాష్ట్రానికి కేటాయించిన నీరు సక్రమంగా రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు న్యాయం ఇవ్వాల్సి న నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశ్యంతోనే అప్పర్‌భద్రాకు నిధులు కేటాయించిందని తూర్పారబట్టారు. కనీసం ఇప్పటి వరకు పోలవరానికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు సైతం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం.. అటు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తాగునీరు, సాగునీరు ప్రాజెక్టులపై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర నాయకత్వ బృందం తుంగభద్ర డ్యాం నుంచి శ్రీకాకుళం పలాస నీటి ప్రాజెక్టు వరకు అన్ని ప్రాజెక్టులను 8 రోజులపాటు పరిశీలిస్తామన్నారు. అనంతరం ప్రాజెక్టుల వారీగా నివేదికలు తయారు చేసి అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో చర్చిస్తామన్నారు. అనంతరం నీటి ప్రాజెక్టులన్ని పునరుద్దరించే విధంగాకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అనేక సందర్భాల్లో వేలాది టిఎంసిల నీరు వృథా సముద్రంలో కలిసి పోతుందని ఇంతజరుగుతున్నా రాష్ట్రప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, ఓబులేసు, ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, అక్కినేని వనజ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, చేతివృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, సిపిఐ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, పుట్టపర్తి సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శిలు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవప్ప, కేశవరెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, రామకృష్ణ, రమ, రాజేష్‌గౌడ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య, నాయకులు రాధాకృష్ణ, సుంకయ్య, రంగన్న, రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రామాంజినేయులు సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర రిజర్వాయర్, హెచ్‌ఎల్‌సి కాలువ పనులు పరిశీలిస్తున్న సిపిఐ నేతల బృందం

## శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే

# విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు చేరవచ్చు





ప్రశంసా పత్రాలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలోని దృశ్యం

**శ్రీసత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త ప్రతినిధి:**

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులకు అత్యున్నత భవిష్యత్తు ఉంటుందని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తిరూరల్ పరిధిలోని జగరాజుపల్లి గ్రామ సమీపంలో గల మంగళకర పాఠశాల యందు విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ బసంత్‌కమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. సైన్స్ పరంగా విద్యార్థులు మంచి పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే శాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. మానవుని యొక్క మనుగడ అభివృద్ధి, రాబోవు తరాలకు అనుగుణంగా ప్రకృతిని కాపాడడం కోసమే విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రూపొందించిన ప్రాజెక్టులు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, ఇందులో భాగంగా పాఠశాల, మండల స్థాయి పోటీలను నిర్వహించి ప్రతి మండలం నుండి 5 మంది చొప్పున ఎంపిక చేసి సోమవారం మంగళకర పాఠశాల నందు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 32 మండలాల నుండి 160 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, ఇందులో 139 ప్రాజెక్టులు ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానికి ప్రదర్శనల కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆలోచనలకు పునాదిగా ఎంతగానో దోహదపడతాయనికలెక్టర్ తెలిపారు. విద్యార్థుల ఆయా పాఠవాలలకు చెందిన గైడ్ టీచర్ల సూచనలతో ప్రస్తుత పుస్తక వైజ్ఞానిక ప్రదర్శనలో పుస్తకరూపంలో ఉన్న ప్రాజెక్టులే కాకుండా స్వతాహాగా సొంత ఆలోచన విధానంతో తయారు చేసే విధంగా ఆసక్తి కలిగి ఉండాలని కలెక్టర్‌సూచించారు. మన దేశ శాస్త వేత్తలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే భారతదేశాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, ప్రైవేట పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు పంపిణీ మొదలుకొని ట్యాబుల్, ఇంగ్లీష్ బోధనావిధానం అమలు లాంటి అంశాలతో జాతీయ స్థాయిలో రాణిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రేరేపించి క్రీడాల్లో కూడా రాణించేలా ప్రోత్స హించాలన్నారు. పర్యావరణ కాలుష్యం ఏర్పడుతున్న తరుణంలో ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిర్మూలించాలన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, సేంద్రీయ ఉత్పత్తుల ద్వాఆర పండించిన ధాన్యాలు, తృణధాన్యాల వాడకం, ఆరోగ్యం, గ్లోబల్‌వార్మింగ్, తదితర వాటిని ప్రాజెక్టుల్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఇలాంటి ప్రదర్శనల ద్వాఆర విద్యార్థుల్లో విజ్ఞానం,మేధస్సు అభివృద్ధి చెందుతాయన్నారు. నూతన జిల్లాలో తొలిసారిగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు.

### రాష్ట్ర స్థాయికి 10 మంది విద్యార్థుల ఎంపిక

సోమవారం ఏర్పాటు చేసిన వైదా కార్యక్రమంలో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. వాటిలో 'వాతావరణం-పర్యావరణ హిత పదార్థాలు' అనే అంశంపై చిలమత్తూరు జడ్పిహెచ్ఎస్ నుండి 7వ తరగతిచదువుతున్న సంపత్‌కుమార్ మొదటి బహుమతికి ఎంపిక కాగా, అగళి ఎపిఎంఎస్‌లో 9వ తరగతి చదువుతున్న యశ్వంత్ అనే విద్యార్థి ద్వితీయ స్థానంలోను, అలాగే ఆరోగ్యం-పరిశుభ్రత అంశంలో ధర్మవరం మున్సిపల్ హైస్కూల్‌కుచెందిన 10వ తరగతి విద్యార్థి ఉమేరా మొదటి స్థానంలో, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం జడ్పిఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి లక్ష్మినరసింహ ద్వితీయ స్థానంలో, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ అంశంలో ధర్మవరం బిఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలకుచెందిన 10వ తరగతి విద్యార్థి నారాయణ మొదటిస్థానంలో, పరిగి మండలం దానాపురం జడ్పి ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థిని మంజుల ద్వితీయ స్థానంలో నిలిచారు. గణితంలో తనకల్లు గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియన్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి తులసి మొదటి స్థానంలో,చిలమత్తూరు జడ్పిహెచ్ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ధనుంజయ రెండవ స్థానంలో ఎంపికయ్యారు. చివరగా పర్యావరణం-వాతావరణ మార్పు అంశంలో రామగిరి జడ్పిహెచ్ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి వెంకటేష్ మొదటి విన్నర్‌గా, కొత్తచెరువు బాలికల జడ్పిహెచ్ఎస్ నుండి 10వ తరగతి విద్యార్థిని జాహ్నవి ద్వితీయ స్థానంలో నిలిచి విజేతలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఉప విద్యాశ్శాఖ అధికారి రంగస్వామి,జ్యూరి మెంబర్లు జి.ఎల్.ఎన్.ప్రసాద్, సూర్య నాగిరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, మంగళకర ఛైర్మన్ సురేష్, సైన్స్ ఆఫీసర్ ఆనంద్ భాస్కర్ రెడ్డి, ఎంఇఓలు వెంకటరమణ నాయక్, గోపాల్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జగనాసుర పుస్తకం చదివితే అధికార పార్టీ అధినేత గుట్టురట్టు కావడం ఖాయం

**- వివేకా హత్య కేసు కోడి కత్తి కేసులతో రాజకీయ లబ్ది పొందిన అధినేత - ప్రజాస్వామ్యాన్నినడి రోడ్డులో ఉరి తీస్తున్నారన్న సంగతి ప్రజలు గుర్తించాలి - వచ్చే ప్రజా కురుక్షేత్రంలో స్థానిక ప్రజా ప్రతినిధికి పరాభవం తప్పదు - మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్**

**కదిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

జగనాసుర పుస్తకాన్ని రాష్ట్ర ప్రజలు చదివితే.. అధికార పార్టీ అధినేత నేర చరిత గుట్టు రట్టు కావడం ఖాయమని, మాజీ ఎమ్మెల్యే, కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ ద్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు రాక్షస పాలన కబంధ హస్తాల్లో చిక్కుకుని విళవిళలాడుతున్నారన్నారు. వివేకా హత్య కేసు, కోడికత్తి కేసులు టీడీపీ పార్టీలపై రుద్ది ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొంది వైసీపీ తమ పబ్బం గడుపుకుందన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో సిబిఐ అధికారులు చేస్తున్న విచారణ రోజురోజుకు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తున్నారన్నారు. ముఖ్యంగా వైఎస్ వివేకా హత్య కేసుని అప్పటి ఎన్నికల సమయంలో నారాసుర రక్త చరిత అన్న పేరుతో కథనాలను రాసి తమ అధినేత చంద్రబాబుపై బురదజల్లి ప్రజలను మభ్యపెట్టి అధికారం కైవసం చేసుకున్నారన్నారు. ప్రస్తుతం వివేకా హత్య కేసులో దోషులు ఎవరో, నిర్దోషులు ఎవరో రాష్ట్ర ప్రజలకు అర్థం కావాలన్న ఉద్దేశ్యంతో జగనాసుర పుస్తకాన్ని నేడు ప్రజల్లోకి తీసుకొచ్చి విడుదల చేస్తున్నామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధి పదేపదే నేర చరిత్రల గురించి మాట్లాడు టప్పుడు నిజమైన నేర చరిత్ర ఎవరికి ఉందో ఒక్కసారి మననం చేసుకోవాలన్నారు. గురివింద సామెతను ఒకసారి గుర్తు చేసుకుని ఇతర ప్రజా ప్రతినిధులపై విమర్శలు చేయాలని కందికుంట హితవు పలికారు. నిజమైన నేర చరిత్ర ఎవరికి ఉందో.. ఎంతటి ఘనమైన నేర ప్రవృత్తితో ప్రజాపాలన చేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ముఖ్యంగా కదిరి మున్సిపాలిటీలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక ప్రజా ప్రతినిది ఖాద్రి లక్ష్మినరసిహస్వామి కోనేరు అభివృద్ధిని పూర్తిగా విస్మరించి ఇటు భక్తులు, అటు ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. చెల్లిపెల్లి జరగాలి మళ్లీమళ్లీ అన్న చందాన కోనేరు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని కందికుంట విమర్శించారు. అర్బన్ మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఖర్చు పెట్టకుండా మున్సిపాలిటీ అభివృద్దిని అటకెక్కించారని విమర్శించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కుక్కలు చించిన విస్తరిలా తయారైందన్నారు. సబ్ కాంట్రాక్టర్ మున్సిపల్ నిధులను సైతం వాడుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి గ్రహనం పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన పెద్ద మనిషి, ప్రస్తుతం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా మళ్లీ ప్రజలు తనకు అధిక మెజార్టీతో ఓట్లు వేస్తారని, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని కందికుంట ఎద్దేవా చేశారు. అయితే ప్రజలు స్తానిక ప్రజా ప్రతినిధి కల్లిబొల్లి మాటలు కదిరి నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఇప్పటికే ఇతని పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారని, కందికుంట తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జగనాసుర పుస్తకాన్ని ప్రజాస్వామ్య వాధులు, మేధావులు చదివి రాక్షస కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఈ రాష్ట్రాన్ని విముక్తి కలిగించేలా చైతన్యం కల్పించాలని కందికుంట పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, ముభారక్, నాగేంద్ర, రమణ నాయుడులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

# లోకేష్ పాదయాత్రలో బికె పార్థసారధి

**పెనుకొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 18వ రోజు యువగళం పాదయాత్రలో సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం పుత్తూరు శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చిన రాజకుప్పంలో లోకేష్‌ని కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులను కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారా లోకేష్ యువగళం పాదయాత్ర దిగ్విజయంగా 18వ రోజుకు చేరుకుందని, ఈ పాదయాత్రలో భాగంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలతో మమేకం అయి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపైన అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి జగన్ ప్రభుత్వం మొదటి నుంచి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు పెట్టినా 400 రోజులు, 4వేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేస్తామని చెప్పారు. మంగళవారం సత్యవేడుల్లో జరిగే సమావేశ స్థలాన్ని రాష్ట్రస్థాయి నాయకులతో కలిసి పరిశీలించారు.



← లోకేష్‌తో బికె పార్థసారధి

02ATP27_02ATP27.qxd 13-02-2023 PM 10:18 Page 1



## పోతులకే మొదటి ప్రాధాన్యత ...కామ్రేడ్స్



ఎమ్మెల్సీ ఓటు కోసం ప్రచారం చేస్తున్న కామ్రేడ్స్

డి.హిరేహాళ్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : కార్మికులు, కర్షకులు, రైతులు, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారంకు చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో ముందుండి గళం విప్పే వారికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కామ్రేడ్ ఎస్.లోకేష్ తమ అనుయాయులతో కలసి ప్రచారం చేశారు. సోమవారం ఆయన రైతు సంఘం జిల్లా కమిటి సభ్యులు హెచ్.మల్లికార్జున తదితరులతో కలసి పీడీఎఫ్‌తో పాటు పలు ప్రజా సంఘాలు కడప, అనంతపురం, కర్నూలు నియోజకవర్గాల నుండి పీడీఎఫ్ బలపరుస్తున్న డాక్టర్ ఫోతుల నాగరాజు కు పట్టభద్ర ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల కేంద్రంలోని సచివాయాలు, ఉపాధ్యాయులు, పట్ట భద్రులైన ఓటర్లను కలుసుకుని ప్రచారంచేసి కరపత్రాలు పంణీ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు సమస్యలపై ఆయన ముందుడి ఉద్యమాలను నడిపిస్తారని అందరి సమస్యలపై గళం విప్పే ఇలాంటి వ్యక్తిని శాసనమండలికి పంపితే ప్రజలు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికుల సస్యల పరిష్కారంకు తోడ్పాటు అందించిన వారవుతారని వారు ప్రచారంలో పట్ట భద్రులకు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ.నాయకులు శివరాజ్, సిఐటియు నాయకులు లింగన్న, ఎరిస్వామి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం పిబ్రవరి 13 ప్రభాతవార్త,: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి,ఎంపిడీఓ వెంకట్‌నాయుడు తెలిపారు.14 తేదీ మంగళవారం జరప వలసిన సమావేశం అనివార్య కారణాలవల్ల 15వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్టు పత్రికాముఖంగా తెలిపారు.సభ్యులు,సర్పంచ్‌లు. అధికారులు గమనించ వలసిందిగా తెలిపారు.

## టిడిపి నేత యులేటి ఈశ్వరప్ప అత్త లక్ష్మక్క మృతి



లక్ష్మక్క మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మున్సిపాలిటీ పరిధిలో ముదిగల్లు గ్రామంలో యులేటి ఈశ్వరప్ప అత్త లక్ష్మక్క అనారోగ్య కారణాల వల్ల మరణించగా ఆమె మృతదేహానికి పూల మాల వేసి నివాలులు అర్పించి, తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేస్తున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్‌కు హాజరైన టిడిపి యువ నేత



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : అనంతపురం జిల్లా మున్సిపాలిటీకి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఆయన కుమార్తె మధు వెడ్స్ యశ్వంత్‌ల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి టిడిపి యువనేత డాక్టర్ ఉన్నం మారుతి చౌదరి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల వెంకటేషులు, మాజీ సర్పంచు కొత్తపల్లి గోవిందరెడ్డి, భీమలింగ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- యువనాయకుడు ఉన్నం మారుతి చౌదరి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : పట్టణంలోని విద్యుత్ భవనంలో విద్యుత్ అధికారులకు రైతులతో కలిసి టిడిపి యువనాయకుడు ఉన్నం మారుతి చౌదరి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు ఉన్నం మారుతి చౌదరి మాట్లాడుతూ.. కుందుర్పి మండలం అల్లాపురం, యర్రగుంట గ్రామాల పరిధిలో గత నెల రోజులుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం లేదని, దాంతో వ్యవసాయ మోటార్లు కాలిపోవడం జరుగుతోందని, విద్యుత్ 11కెవిపై 34 నుంచి 54కు మారుస్తామని చెప్పి నెల రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో నిత్యం జంపర్లు పోవడంతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే పంటలు ఎండిపోయి ఆత్మహత్యలే శరణ్యమవుతాయని తెలిపారు. ఇప్పటికైనా వ్యవసాయానికి 7 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాయల శ్రీనివాసులు, గోళ్ల సర్పంచు బొజ్జన్న, మాజీ సర్పంచు కొత్తపల్లి గోవిందరెడ్డి, అల్లాపురం, యర్రగుంట రైతులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఓకి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి యువనాయకుడు ఉన్నం మారుతి చౌదరి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారికి టిడిపి యువనాయకుడు డాక్టర్ ఉన్నం మారుతి చౌదరి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందని తరచూ పోలీసులు ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా అడ్డుకుంటున్నారని మేము ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రము నిర్వహిస్తున్నామని అందుకు ఇబ్బందులు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు శర్మాస్, గోళ్ల వెంకటేషులు, మాజీ ఎంపిపి రాయల శ్రీనివాసులు, భీమలింగ తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ 47వ జిల్లా కౌన్సిల్ షమావేశం



నూతన కార్యవర్గ సభ్యులు

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : అనంతపురంలో ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన 47వ యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు రాష్ట్ర కార్యదర్శి సురేష్ పరిశీలకుడిగా వ్యవహరించారు. కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇందులో కళ్యాణదుర్గం జోన్ నుంచి 5 మందికి కార్యవర్గంలో చోటు దక్కింది. రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శిలుగా అబ్దుల్ వహబ్‌ఖాన్, అర్జున్ ఆడిట్ కమిటీ సభ్యులుగా ఓబులేసు, చిత్తప్పలు ఎన్నికయ్యారు.

## శాత వాహన కర్మాగార వాహనాల స్పీడును తగ్గించండి

- దుమ్ముధూళితో అల్లాడుతున్నామని గ్రామస్తుల తహశీల్దారుకు ఫిర్యాదు



తహశీల్దారుకు అర్జీ ఇస్తున్న దృశ్యం



అతివేగంగా వస్తున్న టిప్పర్లు..

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మండల పరిధిలోని శాతవాహన ఇస్పాత్ కర్మాగారం నుంచి బొమ్మనహాళ్ గ్రామానికి టిప్పర్లు, లారీలు అతిగా టన్నేజి వాహనాలు రావడం వల్ల గృహాలలోని సామాగ్రి మొత్తం దుమ్ము, ధూళితో నిండి పోయా యని, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న గృహాల వారికి దుమ్ము, దూళి వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, గ్రామ సర్పంచు వన్నమ్మ, వార్డు మెంబర్లు సోమవారం తహశీల్దారు శ్రీనివాసులుకు రాతపూర్వకమైన అర్జీ ఇచ్చారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామ ప్రధాన వీధులగుండా శాత వాహన కర్మాగారంకు వెళ్లే వాహనాలు అతిగా టన్నేజి వేసుకుని అతి వేగంతో రావడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని, ప్రధాన రహదారి సమీపం లోగల సిద్దలింగేశ్వర ఇంగ్లీష్ మీడియం పాఠశాలతోపాటు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నందున విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని, వారు ఫిర్యాదులో పొందు పర్చినట్లు తెలిపారు. ఇంటి నుంచి ఉదయం సాయంత్రం పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే లారీలు, టిప్పర్లు అతివేగంగా ఒకేసారి 15 నుంచి 20 వాహనాలు ఒకదాని వెనుక మరొకటి రావడం వల్ల విద్యార్థులు వేసుకున్న దుస్తులు సైతం దుమ్ము, దూళితో నిండిపోతున్నాయని, రహదారి దాటాలంటే విద్యార్థులు భయపడుతున్నారని కొంత మంది విద్యార్థులు పాఠశాలలను సైతం మానేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై తహశీల్దారు శ్రీనివాసులు జిల్లా కలెక్టర్‌కు, శాతవాహన కర్మాగారానికి నివేదిక అందిస్తామని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

## విద్యార్థులకు సన్మాన సభ



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు సన్మాన సభ నిర్వహించినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు రాజ్‌కుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బొమ్మనహాళ్ విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి నుంచి జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఎల్.విద్య, ఫణిరాజుఅనే విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో సన్మాన సభ నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇలాంటి పోటీల్లో విద్యార్థులు ముందుకు రావాలని ఎంపికైన విద్యార్థులు మరెన్నో విజయాలను సాధించాలని పాటశాల ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఎల్లవేళలా ఆశీస్సులు ఉంటాయని, మండలం పాఠశాల పేరును విద్యార్థులు మరువరాదని, వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.నాగరాజు, వారితోపాటు ఉపాధ్యాయులు సునీత, తబస్సుం, ఎం.సరస్వతి వీరితోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు రెండు కోటాల బియ్యం ఇవ్వాలని బిజెపి ధర్నా



బిజెపి నేతలు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పిఎం గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఏడాది పాటు ఉచిత బియ్యాన్ని అందించాలన్న ఉద్దేశ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని నిరసిస్తూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట బిజెపి మండల కన్వీనర్ బల్కం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం చౌకధాన్యపు డిపోల ద్వారా తమవంతు బియ్యాన్ని పంపిణీ చేస్తుండడంతో పాటు కేంద్రం అందించే బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని ఈ మేరకు ప్రతినెలా రెండు విడతలుగా బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఒక కోటా మాత్రమే పంపిణీ చేసిన చేతులు దులుపుకుంటోందన్నారు. గత రెండు నెలలుగా అందాల్సిన బియ్యం అందలేదని ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తన ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సభ్యులు రంగరాజు, జిల్లా కార్యదర్శి తిమ్మారెడ్డి, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు వీరోజిరావు, మోహన్‌రెడ్డి, కార్యదర్శి మాణిక్యం, రామాంజినేయులు, జానకిరాం, రంగస్వామి, గగరిన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## గాలితోనే ఇంధనం - రైలును సైతం నడపచ్చు



కదిరప్ప ఫోటో

గుత్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : డీజిల్, పెట్రోల్, విద్యుత్ లాంటి వనరులు లేకుండా కేవలం గాలితోనే ఇంజన్‌కు అవసరమైన శక్తిని ఉత్పత్తి చేసి రైలు ఇంజన్‌ను సైతం పడిపే ప్రక్రియకు తగు నమూనా రూపొందించామని గుత్తికి చెందిన ప్రైవేటు సర్వేయర్ కదిరప్ప తెలిపారు. 1964 నుండి ఈ అంశంపై తాను పరిశోధన చేస్తున్నానన్నారు. కేవలం గాలి ద్వారానే రైలు ప్రయాణించేందుకు అనువైన ఉత్పత్తిని తయారు చేసుకోవచ్చని ఈ మేరకు తన పరిశోధన పత్రాలను జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఓంప్రకాష్‌కు అందచేశామని ఆయన తెలిపారు. వారి పరిశీలన పిమ్మట ప్రభుత్వం చేయూత ఇస్తే ఇంధనం లేకుండా ఇంధన నిల్వపై విస్తృత స్థాయిలో పరిశోధనలు గావిస్తానని ఆయన పేర్కొన్నారు.

## 16న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదీన ఎంపిపి కెంకెర ఈరన్న అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి అమరాపురం మండల పరిధిలోని ఎంపిటిసిలు, జిల్లా పరిషత్ సభ్యులు , కోఆప్షన్ సభ్యులు గ్రామ పంచాయతీ సర్పంచులు సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు. అదే విధంగా మండలంలోని మండల స్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశం నందు ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులను చదివి వినిపించడంతోపాటు మండల స్థాయి అధికారులు సాధించిన ప్రగతిపై సమీక్షా ఇతర అన్ని శాఖల ప్రగతిపై సమావేశంలో ఎంపిపి అనుమతితో ప్రవేశ పెట్టనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## డంపింగ్‌యార్డు నుండి దుర్వాసన

హిందూపురం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

హిందూపురం మండలం మనేసముద్రం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు నుండి దుర్వాసన వెదజల్లుతోందని మనేసముద్రం, మలుగూరు, పెద్దగుండంపల్లి గ్రామస్తులు సోమవారం హిందూపురం మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందచేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసినప్పటి నుండి ట్రాక్టర్ల ద్వారా చెత్తను కుప్పలుగా వేస్తున్నారని చెత్తకుప్పల్లో పందులు తిరుగుతుండడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. చుట్టుపక్కన వున్న పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. అంతేకాకుండా చెత్త దిబ్బలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెడుతున్నారని చుట్టుపక్కల అంతా పొగ కమ్ముకుంటోందని డంపింగ్‌యార్డు దుర్వాసన సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

## ఉచితవైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనురాధ

హిందూపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : హిందూపురం రూరల్ సంతేబిదనూరు, గొల్లాపురం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో ఆయుర్వేద డాక్టర్ అనురాధ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి సీజనల్‌వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు యోగాసనాలు, తదితర ఆరోగ్యసూత్రాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, సోమశేఖర్, సూర్యకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగులో ఉన్న రైతులకు భూమిని పంపిణీ చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

చిలమత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : 8వ విడత భూ పంపిణీలో భాగంగా సాగులో వున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురం గ్రామానికి చెందిన రైతులు సోమవారం డిప్యూటి తహశీల్దార్ హనుమంతుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురం గ్రామంలోని రైతులు 50 సంవత్సరాలుగా 377 సర్వేనెంబర్‌లో దాదాపు 135 ఎకరాల్లో, సర్వేనెంబర్ 67లో 8 మంది రైతులు సాగులో వున్నారన్నారు. కానీ ఇన్ని సంవత్సరాల్లో 7 విడతలు భూమి పంపిణీ చేశారు చిలమత్తూరు మండలంలో భూమి లాక్కోవడం తప్ప భూమి పంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోదన్నారు. తక్షణమే సాగులో వున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమేష్, సిపిఎం నాయకులు రామచంద్ర, నరసింహ, రైతులు మాబు, శ్రీనివాసులు, నంజుండ, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మానెంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్



బహుమతులు అందచేస్తున్న మానెంపల్లి సర్పంచు

లేపాక్షి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మండలంలోని మానెంపల్లి పంచాయతీ గౌరిగానిపల్లి గ్రామంలో సర్పంచు నిర్మలమ్మ ఆమె భర్త వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరిగానిపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మానెంపల్లి చుట్టుపక్కల గ్రామాల యువకులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరిగింది. చివరి ఫైనల్ మా ్యచ్‌లో గౌరిగానిపల్లి జట్టు జగరెడ్డిపల్లి జట్టు తలపడ్డాయి. ఇందులో గౌరివానిపల్లి జట్టు విన్నర్ కాగా, జగరెడ్డిపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. గెలుపొందిన జట్లకు సర్పంచు నిర్మలమ్మ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. గౌరిగానిపల్లి జట్టుకు 12 వేల రూపాయలు, జగరెడ్డిపల్లి జట్టుకు 7 వేల రూపాయల నగదు అందచేశారు. ఈ కార్య క్రమంలో శంకరప్ప, రఘునాథ్‌రెడ్డి, వెంకటాచలపతి (చలిస్వామి), అశ్వత్థప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పర్యాటక పోలీసు కేంద్రం ప్రారంభం

- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రిచే ప్రారంభం




నేడు ప్రారంభించనున్న పర్యాటక పోలీసు కేంద్రం

లేపాక్షి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మండల కేంద్రమైన లేపాక్షిలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నంది విగ్రహానికి ముందు భాగంలో పర్యాటక పోలీసు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు రూరల్ సిఐ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 21 పర్యాటక పోలీసు కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఈ పోలీసు కేంద్రాల ద్వారా లేపాక్షి పర్యటనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు కలగకుండా పర్యాటక పోలీసు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## మోటార్లకు 3 ఫేజ్ కరెంటు సరఫరా చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిన ప్రభుత్వ విద్యుత్ అధికారులు



నిరసన తెలియజేస్తున్న రైతులు

శెట్టూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : మోటార్లకు 3 ఫేజ్ కరెంటు సరఫరా చేయడంలో ప్రభుత్వ విద్యుత్ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని చెర్లోపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామ రైతులు స్వచ్ఛందంగా రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదు. పంటలు ఎండి పోతున్న పట్టించుకునే నాథుడు లేడని మ ఉందే వేసవి కాలం ఈ సమయంలోకరెంటు సరిగా వదలక పోవడం వలన రైతుల పంటలు పూర్తిగా ఎండి పోతున్నాయి. కావున వెంటనే డిఇ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డు మీద గంటపాటు రాస్తారోకో చేయడం జరిగింది. శెట్టూరు సబ్ ఇన్స్‌పెక్టర్ యువరాజు, సిబ్బంది కరెంటు అధికారులతో మాట్లాడి హామీ ఇచ్చిన రైతులు మాత్రం కరెంటు వారిని పిలవాలని డిమాండ్ చేయగా అక్కడ ఉన్న ఎఇని పిలిపించి పై అధికారులతో మాట్లాడి మీకు న్యాయం అయిన విద్యుత్ అందిస్తామని డివిజన్ ఇంజినీర్ ఫోనులో రైతులకు హామీ ఇవ్వడం ద్వారా ఈ సమస్యను నెలలోపల పరిష్కారంచేస్తాం అని అంత వరకు ప్రస్తుతం ఉన్న సమయానికి కరెంటు సక్రమంగా ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతుల ధర్నాను విరమించారు. గంటకు పైగా ధర్నాకు రైతులు కూర్చోవడంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. రైతులు ధర్నాను విరమించడంతో పోలీసులు సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మంపల్లి, చెర్లోపల్లి కైరేవు, కంబాలపల్లి, ఎబ్రోరేపల్లి బొచ్చుపల్లి, చిన్నంపల్లి పాపంపల్లి కొత్తూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన హోంగార్డు మొబిలైజేషన్



మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని శిరసాని హిల్స్ వద్ద ఉన్న పరేడ్‌మైదానంలో హోంగార్డ్స్‌కి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ స్టేషన్‌లలో పని చేస్తున్న హోంగార్డులు అందరూ పాల్గొనగా, వారికి విధి నిర్వాహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్ళు, పెంచుకోవాల్సిన నైపుణ్యాల గురించి శిక్షణ మొదలైన వాటి గురించి మరోసారి జ్ఞప్తి చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సౌత్రన్ రీజన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈయనతో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా ఎఆర్‌డిఎస్‌పి జెడ్.విజయ్‌కుమార్, హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం రెడ్డి, ఎఆర్ ఎస్ఐ శ్రీరాములు, ఇతర హోంగార్డులు, సిబ్బంది హాజరయ్యారు.

## శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ విద్యార్థులకు రాగిజావ సామాగ్రి పంపిణీ బాధ్యత చేపట్టడం పట్ల హర్షం



ఆర్.జె.రత్నాకర్‌ను శాలువతో సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న గోరు ముద్ద పథకానికి అనుసంధానంగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రాగిజావ అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సరిపడ సామాగ్రి అందించేందుకు ముందుకు రావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమౌతోంది. సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌ను కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనకు పూలమాలలతో పాటు శాలువలు కప్పి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో క్రమ బద్ధంగా పంపిణీ చేయడం ఒక సత్యసాయి ట్రస్ట్‌కే సాధ్యమని కొనియాడారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళాపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, వైస్‌ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, నెట్‌క్యాబ్ డైరెక్టర్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి, నాయకులు ఎస్‌టిడి నరసింహులు, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిన లారీ

-తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన బాధితులు





లారీ ఢీకొనడంతో గాయపడిన సిద్దలింగయ్య, హరీష్ దృశ్యాలు

ఉరవకొండ. ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : పట్టణ శివారు ఈద్గా మైదానంవద్ద అనంతపురం–బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఉండబండ క్రాస్‌వద్ద లారీకు పంక్చర్ కావడంతో ఆగిపోయిన లారీ టైరును దాని డ్రైవర్ గాదిలింగయ్య పంక్చర్ వేయించడం కోసం తోసుకొంటూ ఉరవకొండ వైపుకు వస్తుండగా అనంతపురం నుండి బళ్లారి వైపునకు వేగంగా వెళుతున్న లారీ టైరు ఢీకొనడంతో ఆటైరు ఎగిరి అటువైపుగా ద్విచక్రవాహనంపై వెళుతున్న బూదగవికి చెందిన హరీష్‌తోపాటు టైరును తోసుకొంటున్న వస్తున్న గాలిలింగయ్యను బలంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఢీకొన్న లారీ మాత్రం ఆపకుండా ముందుకెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో స్థానికులు గాయపడిన ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాధమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన బళ్లారికి చెందిన గాదిలింగయ్యను వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్సకై అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు. కాగా ఆపకుండా వెళ్లిపోయిన లారీను విడపనకల్లు వద్ద పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది.

## నూతన విద్యాధికారి సాయిరాంను కలిసిన ఏపీటీఎఫ్ నేత గవ్వల సోమశేఖర్

-పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన నేత



జిల్లా నూతన విద్యాధికారి సాయిరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీటీఎఫ్ నేత గవ్వల సోమశేఖర్

ఉరవకొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : అనంతపురం జిల్లా నూతన విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయిరాంను ఉరవకొండ మండలానికి చెందిన ఏపీటీఎఫ్ నేత గవ్వల సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా కేంద్రం అనంతపురంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఓను కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధికి తీసుకునే చర్యలకు ఏపీటీఎఫ్‌గా తమ సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని గవ్వల సోమశేఖర్ డీఈఓతో అన్నారు.

## శ్రీశైలానికి ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

- జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూధన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీసత్యసాయి జిల్లా నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్‌టిసి జిల్లా ప్రధాన అధికారి మధుసూధన్ రెడ్డి. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఈ నెల 15 నుండి నడపబడతాయన్నారు. ప్రత్యేక బస్సులతో పాటు శ్రీ శైలం పుణ్యక్షేత్రం దర్శించుకోవడానికి సర్వదర్శనానికి రూ.300లు, శీఘ్ర దర్శనానికి రూ.150లు, టికెట్ ధర కాక అదనంగా చెల్లిస్తే నేరుగా భ్రమరాం బ మల్లికార్జున స్వామి దర్శనానికి ఆర్‌టిసి వారే సమకూర్చడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 800 దర్శనం టికెట్లు దేవస్థానం కేటాయించిందని, భక్తులు సమీప బుకింగ్ కేంద్రాలను సంప్రదించాలని లేదా ఆయా బస్టాండ్‌లలో ఆన్‌లైన్ ద్వారా ముందుగా టికెట్లు పొందవచ్చని ఈ సౌకర్యాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా మా కక్షిదారుడయిన హిందూపురం కంసలపేటలో డోర్‌నెం.7-9-11 నందు కాపురముంటున్న ఈ.బాలరాజు కుమారుడు ఈ.శాంతరాజు తాను టి.ఆర్.అన్నపూర్ణమ్మ వగైరాల నుండి కొనుగోలు చేసిన ఒరిజనల్ క్రయపత్రము తేది: 14.3.2018 డాక్యుమెంటు నెం: 2537/2018 మరియు 18.06.2018వ తేదీన టి.ఓ.శ్రీనాగ్ మరియు హెచ్.వి. గౌతమిల నుండి కొనుగోలు చేసిన ఒరిజినల్ క్రయపత్రము డాక్యుమెంట్ నెం. 5789/2018లు హిందూపురం APSRTC బస్టాండ్‌లో 6.2.2023 నాడు బస్సు కోసం నిరీక్షించుచుండగా సదరు డాక్యుమెంట్లకు సంబంధించిన చేతి సంచి పోగొట్టుకొనిపోయినది. అవి ఎంత వెతికినను హిందూపురం S.H.O. 1 Town స్టేషనులో మా కక్షిదారుడు ఫిర్యాదు కూడా ఇవ్వడమైనది. సదరి ఒరిజినల్ పత్రాలు ఎవరికైనా లభ్యమైనయెడల క్రింది చిరునామాకు గానీ లేక మా కక్షిదారుడికిగాని అందజేయ ప్రార్థన. సదరి పత్రాలు ఎవరైనా దుర్వినియోగం చేసిన వారు చట్టరిత్యా శిక్షార్హులని తెలియజేయడమైనది.

**షెడ్యూలు**

హిందూపురం పట్టణం ఎం.ఎఫ్. రోడ్డులో గల ఆస్తి వివరం పార్డు-3, కొత్తవార్డు : 18, బ్లాక్ :8, T.S.No: 664, 15/237 (పాత డోర్ నెం), 18-1-129/1 (కొత్తడోర్ నెం) మరియు ఖాళీ జాగా

కె.సత్యనారాయణ, అడ్వకేట్, హిందూపురం, సెల్ : 94402 59524

03ATP13_03ATP13.qxd 13-02-2023 PM 11:20 Page 1



## మానవత్వం చాటుకున్న శ్రీ వెంకటరమణస్వామి బోర్ బండి అసోషియేషన్ నేతలు

### - ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబానికి రూ.3.20 లక్షల ఆర్థిక సాయం - భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం - ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం నేతలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

.ప్రమాదవశాత్తు మృతి చెందిన వడ్డెర అంజి కుటుంబానికి రూ.3.20 లక్షల ఆర్థిక చేయూతనందించి మరోసారి తన ఉదార స్వభావాన్ని చాటు కుంది శ్రీ వెంకటరమణ స్వామి బోర్ బండి అసోషియేషన్. శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం బూదిలి వాండ్ల పల్లి గ్రామానికి చెందిన గంగరత్న, లక్ష్మయ్య కుమారుడు అంజి వృత్తి రీత్యా ఒరిస్సాలోని క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న ఆ సంఘం అధ్యక్షులు దళవాయి పెద్ద మారెప్ప ఆధ్వర ంలో అనంత, శ్రీ సత్యసాయి ఉమ్మడి జిల్లాల వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు దళవాయి వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు వడ్డే సిమెంట్ పోలన్న, ప్రధాన కార్యదర్శిజరిపిటి కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన తల్లి చేతికి రూ.3.20 లక్షల ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాన్ని ఆదు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లా డు తూ.. శ్రీ వెంకటరమణస్వామి బోరుబండి అసోషియే షన్ తరుపున ఉమ్మడి జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ఉమ్మడి జిల్లా ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. వడ్డెర్లు కింద క్వారీలలో ప్రమాదవశాత్తు మర ణించిన, గాయపడినా వారికి మేము అండగా ఉంటామని ప్రో త్స కల్పిస్తూ వారికి రూ. 50వేల నుంచి మూడు లక్షలపై బడి ఆర్థిక సాయం చేసిన అనేక కుటుంబాలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు దళ వాయి వెంకట రమణ మాట్లా డుతూ.. అనంత శ్రీ సత్యసా యిజిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వార్యంలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నార. ఈ కార్యక్ర మంలో శ్రీ సత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం కార్యదర్శి సభ్యులు, ఉపాధ్యక్షులు మారెప్ప, బత్తల రాజా, దళవాయికుమార్, దేరంగుల హరి, బత్తల జయ, చిన్నమారెప్ప, బూదిలి వాండ్లపల్లి రంగయ్య, మాజీ సర్పంచు బాలకృష్ణ, రాము, శ్రీనివాసులు, జరిపిటి శంకర్, గుణశేఖర్, పి.లక్ష్మి నరసప్ప, వెంకట రమణప్ప, డీలర్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉమ్మడి జిల్లాల వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు

## నారాయణ జూనియర్ కళాశాలకు వత్తాసుగా పని చేస్తున్న ఆర్ఐఓను సస్పెండ్ చేయాలి

### -నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి - ఇంటర్మిడియెట్‌బోర్డు ఆర్జెడి రవికి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయా లని నారాయణ జూనియర్ కళాశాలకు వత్తాసుగా పని చేస్తున్న ఆర్ఐఓ సురే ష్‌బాబును సస్పెండ్ చేయాలని ఇంటర్మిడియెట్ ఆర్జెడి రవికి అనంతపు రంలో పర్యటనకు వచ్చిన సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుళ్లా యిస్వామి,, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు ఆకుల రాఘవేంద్ర, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పృధ్వి, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్‌ల ఆధ్వ ర్యంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన ంతపురం నగరంలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మిడియెట్ మొ దటి సంవత్సరం చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థిని ఇటీవల ఫీజుల కోసం వేదించడంతో ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఆత్మ హత్య ప్రయత్నానికి ఫీజుల ఒత్తిడే కారణమని తెలిపారు. జి ల్లా ఆర్ఐఓ ఇప్పటి వకు నారా యణ కళాశాలపైన ఏమాత్రం చర్యలు తీసు కోకుండా కాల యాపన చేస్తున్నారన్నారు. తక్ష ణమే నారాయణ కళాశాలను సీ జ్ చేయాలని డిమాండ్ చేశా రు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఈ సం దర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రమణయ్య, నరసింహా యాదవ్, గిరి సూర్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్జెడి రవికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

## గోరంట్ల పట్టణ వాసులకు చేరువలో రిలయన్స్ ట్రెండ్స్

### - నూతన స్టోర్ ప్రారంభం.. ఆకర్షణీయమైన ప్రారంభోత్సవపు ఆఫర్

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో

భారతదేశంలో అతి పెద్ద, వేగవంగా వృద్ధి చెందుతున్న అప్పారెల్, యాక్స సరీస్ ప్రత్యేక చెయిన్ రిలయన్స్ ట్రెండ్స్ శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలో తమ నూతన స్టోర్‌ని ప్రారంభించింది. 5539 చదరపు అడుగుల విస్తీర్ణంగల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్య త, ఆకర్షనీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది.

అలాగే ఈ స్టోర్ గోరంట్ల ఆపంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా అందుబాటైన ధరలో, తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉంది. ఈ పట్టణానికి చెం దిన కస్టమర్లు.. సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురు చూడవచ్చు. ప్రత్యేకమైన ప్రారం భోత్సవపు ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ. 199 కె ఉత్తేజ భరితమైన బహు మతి పొందవచ్చు. అంతేకాదు రూ.2999 కొనుగోలుపై వినియోగదారులు రూ .3 వేలు విలువగల కూపన్లు పూర్తి ఉచి తంగా పొందగలుగుతారు. కాబట్టి గొ ప్ప ఫ్యాషన్ షాపింగ్ అనుభవాన్ని ఆన ందించడానికి ఇప్పుడే గోరంట్ల ట్రెం డ్స్ స్టోర్‌కి విచ్చేయండని రిలియన్స్ ట్రెండ్స్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.




రిలియన్స్ ట్రెండ్స్

## విద్యార్థుల ఎదుగుదలలో సాఫ్ట్ స్కిల్స్ ప్రభావం తప్పనిసరి

### - పివికెకె కళాశాలలో ఒకరోజు సెమినార్ నిర్వహణ

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో

విద్యార్థుల కెరీర్‌ఎదుగుదలలో సాఫ్ట్ స్కిల్స్ ప్రభావం తప్పని సరిగా ఉంటు ందని బెంగుళూరు ఎమిటి యూని వర్సిటీ డైరెక్టర్ డా.సునీల్ బి రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని పివికెకె డిగ్రీ, పిజి కళా శాలలో ఫ్యూచర్ వర్క్ ఫోర్స్ పేరుతో ఒక రోజు సెమినార్ నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.ముని కృష్ణరెడ్డి, అధ్యక్షత వహించగా సెమి నార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. సెమి నార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తులో అభివృద్ధి కొరకు జ్ఞానంతోపాటు విదేయత, విలువలు కూడా ప్రభావం చూపుతాయని పేర్కొ న్నారు. ప్రస్తుత పౌరుల ఉద్యోగ అభివృద్ధి, అవకాశాలు కొరకు ఉపయో గపడే మాస్ కమ్యునికేషన్ జనరేషన్ టెక్నా లజీ అందుబాటులోకి వచ్చిందని ఆయన వివరించారు. కాగా తమ కళాశాల లో విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కొరకు తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వీరితోపాటు ఎంఎంఎస్ కోఆర్డినే టర్ వెంకట్‌కుమార్, కేశవయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.మునికృష్ణరెడ్డి




ముఖ్య అతిథిని సన్మానిస్తున్న దృశ్యం

## సైనిక వెల్ఫేర్‌కు రూ.1,27,190

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 2022-23 సాయుధ దళాల పథక దినోత్సవం డిసెంబర్ 7 కొరకు అనంతపురం నగర పాలక సంస్థ మెప్మా పరిధిలో గల స్వయం సహాయక సంఘా ల సభ్యుల నుంచి స్వచ్ఛంద విరాళాలు సేకరించడం జరిగింది. ప్రతి స్వయం సహాయక సంఘములోని సభ్యురాలు నుంచిరూ.10 చొప్పున స్వచ్ఛందంగా విరా ళాలు సేకరించడం జరిగింది. ఈ సేకరణ కలెక్టర్, జిల్లామిజిస్ట్రేట్ చైర్మన్, జిల్లా సైనిక బోర్డు అనంతపురం వారి ఆదేవాల మేరకు 7/11/2022 నుంచి 8/02/2023 వరకు సేకరించి, ఆ మొత్తం 1,27,190లను జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసరు అనంతపురం వారి పేరున డిడి తీయడం జరిగింది. ఈ డిడిని అనంతపురం నగర పాలక సంస్త కమిషనర్ కె.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా టిఎల్ఎఫ్‌కి అందజేయడం జరిగి ంది. సైనిక అధికారులకు టిఎల్ఎఫ్ వారి ద్వారా అందజేయడం జరుగు తు ంది. ఈ కార్యక్రమంలో శ్రీ సంఘం శ్రీనివాసులు, నగర పాలక సంస్త సెక్రెట రీ, జె.విశ్వజ్యోతి(టిపిఆర్ఓ), ఏ.శ్రీనివాసరెడ్డి (టియంసి), పట్టణ సమాఖ్య (ఓబి)మెంబర్లు, లక్ష్మిదేవి, అబీదా షారుపున్ని, (సిఓ)లు పాల్గొన్నారు.



డిడిని అందజేస్తున్న దృశ్యం

## సాయిట్రస్టు ఆధ్వర్యంలో శత సహస్ర పార్థివ లింగార్చన కార్యక్రమం

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మొ ట్టమొదటి సారిగా మాఘమాసం 3వ సోమవారం పురస్కరించుకుని పార్తివ లింగాలకు దశ సహస్ర నామాలతో లింగార్చన కార్యక్రమం తపోవనంలోనిచిన్మయ జగదీశ్వ రాలయంలో సోమవారం (13వ తేది) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్మయ జగదీశ్వ రాలయం అనంతపురం ఇన్‌చార్జ్ ఆత్మ విధానంద స్వామి, విరుపాక్ష దత్త పీటం విద్య నృసింహ భారతి, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ వా సంతి సాహిత్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాద్ విత రణ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి సాయిట్రస్టు అధ్యక్షులు విజయ సా యి మాతృమూర్తి రుక్మిణి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మనూరు నాగరాజు, చిన్మయ జగదీశ్వరాలయం రామాంజి, మురళీధర్‌రెడ్డి, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ నాయక్, రాఘవేంద్ర, అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.



భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన పార్తివ లింగం

## పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి యం.సాయిరాం సోమ వారం మధ్యాహ్నం నగరంలో కోర్టు రోడ్డులో ఉన్న నెహ్రూ నగర పాలక యుపి స్కూ ల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థుల గదిలోకి వెళ్ళి బైజూ్యస్ ట్యాబులను విద్యా ర్థులు ఏ విధంగా వినియోగిస్తున్నారోనని ఆరా తీశారు. వాటిని ఏవిధంగా ఎలా వినియోగించాలోనని విద్యార్థులకు అవగాహన లేకపో వడా న్ని డీఈవో గుర్తించారు. ట్యాబులను డీవైఈవో పద్మప్రి య, ఎంఈవో వెంకటస్వామి ఓపెన్ చేసి డీఈవోకు, విద్యార్థులకు చూపించారు. అదే విధంగా పలువురు విద్యార్థులు షూలు వేసుకురా కపోవ డంపై ఆరా తీశారు. సైజులు సమస్యల వలన ఇంకా ఇవ్వలేదని హెచ్ ఎం గంగాధర్ డీఈ వోకు తెలిపారు. అలాగే విద్యార్థులతో పుస్తకాలను చదివిం చారు. అనంతరం టీచర్ల మ్యానువల్ అటెండన్స్‌ను పరిశీలించగా కొందరు టీచర్లు సిఎల్ పెట్టిన విషయాన్ని గుర్తించి...ఆ కొందరు టీచర్లు సిఎల్ ఎందు కు పెట్టారని ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ...బైజ్యూస్ ట్యాబుల వినియోగంపై జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, టీచర్లకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

**కలెక్టర్‌ని కలిసిన డీఈవో :** అనంతపురం విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించిన యం.సాయిరాం సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ట్యాబులను పరిశీలిస్తున్న డీఈవో యం.సాయిరాం



అటెండెన్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో

## స్విమ్మింగ్ స్కూల్ గేమ్స్ పోటీలలో అనంతపురం జిల్లా విద్యార్థి ప్రతిభ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ స్కూల్ గేమ్స్ పోటీలలో అనంతపురం జిల్లా క్రీడాకారిని ప్రతిభ కనబర్చి 50 మీటర్స్ బ్యాక్‌స్ట్రోక్‌లో సెకండ్ ప్లేస్‌రావడం జరనిగింది. జాతీయ స్థాయికి సెలెక్ట్ అవ్వడం జరిగింది. శ్రీ కన్యకా ఈ క్రీడాకారులన్ని అనంతపురం డిస్టిక్ డిఈఓ సాయిరాం, అనం తపురం జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రెటరీ రవికుమార్‌లు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## రాప్తాడు సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా మన్నిల కిరణ్

రాప్తాడు, పిబ్రవరి 13 ప్రభాతవార్త

మండల వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా బొమ్మపర్తి గ్రామ పంచాయితీకి చెందిన మన్నిల కిరణ్‌ని ఎంపిక చేసినట్లు రాప్తాడు ఎంపిపి చిట్రెడ్డి జయల క్ష్మి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎంపికైన మన్నిల కిరణ్ పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతోపాటు పార్టీ బలో ఎతానికికృషి చేసి ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలను తిప్పి కొట్టాలని తెలియజేశారు. ఈ సంద ర్భంగా మన్నిల కిరణ్ మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో రాప్తాడు మండ ల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎమ్మెల్యే తోపు దుర్తిప్రకాష్‌రెడ్డి ఎంపిక చేయడం జరిగిందని ఎమ్మెల్యే, ఎంపిపిల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపే తానికి కష్టపడి పని చేస్తానని తెలిపారు. అనంతరం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి, ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి, సత్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా నా ఎంపికకు సహకరించినమండల నాయకు లకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



మన్నిల కిరణ్

## ఊరి దేవరల పేరిట జంతుబలి నిషేధం జరగాలి

### - హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించేలా చర్యలకు వినతి.... - విశ్వప్రాణి కళ్యాణమండలి అధ్యక్షుడు దయానందస్వామి

బళ్లారి, ఫిబ్రవరి13, ప్రభాతవార్త ; గ్రామదేవతలు, ఊరిదేవరల పేరిట గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న జంతుబలి యథేచ్ఛగా జరుగుతున్నదని, దీనిని నిర్మూలించాల్సిన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నట్లు విశ్వప్రాణి కళ్యాణమండలి అధ్యక్షుడు దయానందస్వామి తెలిపారు. బళ్లారిలో సోమవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన బళ్లారితో పాటు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో, గ్రామాల్లో జంతువుల వధ జరుగుతున్నదని, దీనిని నియంత్రించాల్సిన జిల్లా యంత్రా ంగాలు, చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా కట్టుదిట్టంగా ఆదేశాలు జిల్లాధికారులకు చేయకపో వడం, జంతుబలులు యథేచ్ఛగా జరుగుతుండడం ఆందోళనకరమని చెప్పారు. తమ విశ్వప్రాణి కళ్యాణమండలి ఆధ్వర్యంలో జంతుబలి నిషేధం ఆయా గ్రామాల ఉత్సవాల్లో, దేవరల, గ్రామదేవతల ఉత్సవాల్లో నిషేధం తప్పనిసరి చేసేలా పోరాటం జరుపుతున్నామన్నారు. కర్ణాటకలో జరుగు తున్న జాతరలు, ఉత్సవాలు, ధర్మాలపేరిట అహింసాత్మకధోరణిలో ధార్మిక కార్యకలాపాలు ఆచరణ జరుగుతున్నదని, వీటి ఉద్దేశం ప్రధానంగా జంతుబలి కావడమేనని పేర్కొన్నారు. జంతుబలి నిషేధం ఆయా గ్రామాల ఉత్సవాల్లో జరపకూ డదని, ఒకవేళ జరిగితే అందుకు బాధ్యులుగా ఆయా దేవస్థానాల ట్రస్టుతో పాటు సంబంధిత తహసీల్దార్, జిల్లాధికారి బాధ్యులుగా గుర్తించాల్సి ఉంటుందని హైకోర్టు ఆదేశంలో స్పష్టంగా పేర్కొనబడిందని, హైకోర్టు ఆదేశం ధిక్కరణ జరగకుండా తప్పనిసరిగా పాటించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాధికారులకు గట్టిగా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తమ మండలి కర్ణాటకలో మాత్రమేగాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కూడా జంతుబలి నిషేధం పట్ల జాగృతి కల్పించే యాత్రలు చేపడు తున్నట్లు, 30 సంవత్సరాలుగా తమ విశ్వప్రాణి కళ్యాణమండలి చేపడుతుందని తెలిపిన దయానందస్వామి, ప్రాణిబలి రహిత భారతదేశంగా చేయడమే తమ మండలి ప్రధానధ్యేయంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారతదేశం నుంచి మాంసం ఎగుమతి భారీగా జరుగుత్నునదని, ప్రపంచ దేశాల్లో మాంసం ఉత్పత్తి, ఎగుమతి చేస్తున్న దేశాల్లో రెండోదిగా గుర్తింపు పొందినదని, దీనిని బట్టి చూస్తే దేశంలో ఎన్ని ప్రాణులను దిననిత్యం వధ చేస్తున్నారో అర్థం చేసుకో వచ్చున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఇటువంటి హేయమైన అనాగరిక మాంసం ఉత్పాదన జరుగుతుండడం శోచనీయ మన్నారు. గోహత్యపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం గోమాంసంతో పాటు ఇతర ప్రాణుల మాంసాన్ని మరెందుకు విదేశాలకు పంపుతున్నారు, వాటి ఆదాయం, పన్ను లు, దేశానికి అవసరా అని ప్రశ్నించారు. గోహత్య నిషేధ చట్టం దేశంలో సక్రమంగా జరగడంలేదన్న ఆవేదన దయానందస్వామి వ్యక్తం చేశారు. దీనిపై తాము అంచలంచెలగా పోరాడం చేపడతామన్నారు. ఈ సందర్భంలో బళ్లారి జీన్స్ ఉత్పాదకుల సంఘం నాయకులు ఉత్సవ్‌లాల్‌బాగ్రేచా, ఓషన్‌జైన్, హంపన్నగౌడ, సునందాదేవి, భరత్‌సింగ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న దయానందస్వామి

## ఎస్ఐపిలో రిజిస్ట్రేషన్ కావాలి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుట కొరకు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించుట కొరకు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ యునిసెఫ్ వారి సౌనజ్యంతో ఎస్ఐపి అను కార్యక్రమాన్ని అమలు పరుస్తోంది. ఇందుకుగాను సిప్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి ఉన్నత పాఠశాల, 8వ తరగతి గల ప్రాథమికోన్నత పాఠశాలలు తప్పని సరిగా రిజిస్టర్ అవ్వవలెను. ఆయా పాఠశాలల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయులు లేదా గణిత ఉపాధ్యాయులు వీరెవరూ లేని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా నోడల్ ఉపాధ్యాయులుగా నమోదు చేసుకుని 8, 9, 10 తరగతులు చదువుతున్న 25 మంది విద్యార్థులను కూడా రిజిస్టర్ చేయవలసినదిగా ఆదేశించడమైంది. కమిషనర్ వారు సిప్ ప్రగతిని నేరుగా పరిశీలించటం జరుగుతున్నందున ఈ విషయమై మంగళవారం సాయంత్రంలోగా ఎస్ఐపిలో రిజిస్ట్రాన్ పూర్తి చేయవలెనని ఆదేశించడమైంది. ఇతర సందేహాల నివృత్తి కొరకు రితిక-7893127358, గణేష్-6304646559లో సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## వాసన్ ఐ కేర్ వారి సౌజన్యంతో కంటి పరీక్షలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ పక్కీరనప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు పిఎస్ఓలకు, మొబ లైజేషన్ లో ఉన్న హోం గార్డులకు ఉ చిత కంటి పరీక్షలు నిర్వహి ంచారు. స్థానిక పోలీస్ షాధీ ఖానాలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఏఆర్ అద నపు ఎస్పీ ఎ.హనుమంతు పర్య వేక్షణలో ప్రతి ఒక్కరికీ వాసన్ ఐ కేర్ వారి సౌజన్యంతో కంటి పరీక్షలు చేశారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## సోలార్ వద్దు - వ్యవసాయ భూమి ముద్దు



తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

సోలార్ వద్దు వ్యవసాయ భూమి ముద్దు, పేద రైతులకు అన్యాయం అనే నినాదంతో మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు రైతు సంఘం నాయకులు మండల కేంద్రానికి చేరుకొని ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బడాసుబ్బిరెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒక పేద సామాన్య రైతు కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న భూమిని భూపట్టా కావాలని అడిగితే ప్రభుత్వ జీవో రావాలంటూ అధికారులు చెబుతున్నారు. కానీ దనియానిచెరువు పరిసర ప్రాంతాలలో వందల ఎకరాల భూమిని కొన్ని బడా కంపెనీలకు భూమిని ఇవ్వడం జరిగింది కానీ వారికి భూమి ఇవ్వడంలో ఎలాంటి జీఓలు వర్తించవు అని తెలపడం జరిగింది. అదేవిధంగా ఎన్‌పికుంట మండలంలో 10432 ఎకరాలను రైతులు వ్యవసాయం కోసం సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం వారు ఆదానీ అంబానీ కంపెనీలకు ప్రభుత్వం పేదల భూములు లాక్కొని పేద రైతులకు అన్యాయం చేస్తున్నారని, అదేవిధంగా దనియా నిచె రువు, వెలిచెలమల , వంకమద్ది, మర్రికొమ్మదిన్నె గ్రామాలలో ంైతుల భూ ములను వశం చేసుకుంటున్నా ఈ భూమి విషయంలో రైతులు చావడా నికి అయినా సిద్ధంగా ఉన్నారు. ఈ విషయంపై అధికారులు భాద్యత లు కావా లని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయ కులు నాగిరెడ్డి, నాగరాజు, శివయ్య, శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

## మాపై దాడులు చేసి కేసుల మా మీదనే నమోదు చేస్తున్నారు

### - ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయండి సాకే హరి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయడమే కాకుండా వారిపైనే కౌంటర్ కేసులు నమోదు చేయ డం ఏంటని ఎస్సీ, ఎస్టీ సంఘా ల జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ప్రశ్నించారు. సోమవారం నగర డిఎస్పీ ప్రసాద్‌రెడ్డిని కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వినతిపత్రం అందజేశ్వారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు దా డులు, దౌర్జన్యాలు, అత్యాచారాల నుంచి విముక్తి కల్పించడానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ఉపయో గపడుతుందన్నారు. అయితే అట్రాసిటీ కేసులకు స్టేషన్ బెయిల్ మంజూరు చేయడం అన్యాయమన్నారు. దళిత, గిరిజనులపై జరుగుత్ను దాడులను అరికట్టాల్సిన పోలీసులు రాజకీయ నాయకులకు వత్తా సు పలుకుతూ కౌంటర్ కేసులు నమోదు చేయడాన్ని తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే చిరంజీవి, మహిళ జిల్లా అధ్యక్షురాలు ముత్యాలమ్మ, సాకే గోవిందు, సుం కన్న, జేఏసి నాయకులు రేకుల కుంట రామాంజినేయులు, శింగంపల్లి, కేశవ, మన్నల శివయ్య, రామకృష్ణ, శాంతమ్మ, గణేష్‌నాయక్, ఎరిస్వామి, ప్రతాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సాకే హరి తదితరులు

## జిల్లాలో 3,672 కేసులు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కారం

### - రూ.28.18 కోట్ల మొత్తం పరిహారం వసూలు

బళ్లారి, ఫిబ్రవరి13, ప్రభాతవార్త ; జాతీయ న్యాయసేవల ప్రాధికారం, రాష్ట్ర న్యాయసేవల ప్రాధికారంల సంయుక్తాధ్వర్యంలో బళ్లారి జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 11వ తేదీన శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో సుమారు 3,672 కేసుల్ని పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవల ప్రాధికారం సభ్యత్వ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సతీష్‌జేబాళి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో జిల్లా ప్రధాన సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి పుష్పాంజలిదేవి మార్గదర్శకంలో మొత్తం 32 బెంచీలను ఈ లోక్‌అదాలత్‌లో ఏర్పాటు చేసినట్లు, జిల్లా కోర్టులో జరిగిన ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో 9,657 కేసులు విచారణకు వచ్చినట్లు, ఇందులో విచారణ దశలో ఉన్న దావాలు, ఇతర పెండింగ్‌లో ఉన్న కేసుల్ని విచారణకు తీసుకున్నట్లు, లోక్‌అదాలత్‌లో మొత్తం 3672 కేసుల్ని రాజీ మార్గం ద్వారా పరిష్కృతం చేసినట్లు పేర్కొన్నారు.

తద్వారా రూ.28,18,86,847 పరిహారం కక్ష్యిదారులకు ఇప్పించినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి 251 చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు 40, రుణవసూళ్ల కేసుల్లో 42, మోటార్ వాహనాల ప్రమాదం కేసులకు సంబంధించి 120 కేసులు, వాటా విభజన కేసులు 67, మోటార్ వాహన చట్టం అమలు జారీ కేసులు 28 పరిష్కారమైనట్లు తెలిపారు. అదాలత్‌లో 11 వివాహిత దంపతుల డైవర్స్ కేసుల్ని తీసుకుని, కౌన్సెలింగ్ నిర్వహించి విజయవం తంగా రాజీ సంధాన మూలకంగా కలిపినట్లు, సుఖంగా జీవనం సాగించాలని సూచన చేసినట్లు చెప్పారు. అదాలత్‌లో సార్వజనికులు తమ వ్యాజ్యాలను రాజీ మూలకంగా కోర్టు ప్రమేయం లేకుండా ఈ లోక్‌అదాలత్‌లో ఫీజు లేకుండా పరిష్కరించుకున్నారని వివరించారు. లోక్‌అదాలత్‌లో జిల్లాలోని న్యాయమూర్తులు, కక్ష్యిదారుల పరంగా న్యాయవాదులు పాల్గొని జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేశారని చెప్పారు.



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి సతీష్‌జేబాళి

## సూపరింటెండెంట్‌గా పదోన్నతి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఏపి రెసిడెన్షియల్ సొసైటీ పర్యవేక్షకులుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ డైరెక్టర్ హర్షవర్ధన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయం ఉద్యోగులు, వార్డెన్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తుంగభద్ర ప్రధాన కాలువను పరిశీలించిన సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ





హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
మండల పరిధిలోని తుంగభద్ర ప్రదాన కాలువను సోమవారం సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వారి బృందం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ప్రధాన కాలువ వద్ద విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే ఇరిగేషన్‌ప్రాజెక్టులను పట్టించుకోక పోవడం వాటికి నిధులు కేటాయించకపోవడం ముఖ్యమంత్రి వైఫల్య మని వారు విమర్శించారు. అందుకోసం సిపిఐ పార్టీ తుంగభద్ర జలాశ యం నుంచి శ్రీకాకులం వరకు రాష్ట్రంలోగల అన్ని నీటి పారుదల ప్రాజెక్టు లను పరిశీలించి నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని ఈ పర్యటన 10 రోజులు చేపట్టామని అందుకు రాష్ట్రం లోగల అన్ని ప్రతిప క్షాల ను కలుపుకుని నిర్వహిస్తామని వారు తెలిపారు. హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలు వపై నిర్మించిన కల్వర్టులు శిథిలావస్తకు చేరి కూలిపోతున్నాయని వాటిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వారు అన్నారు.
ఈ కార్య క్రమంలో వారితోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనజ, ఓబులేసు, జగ దీష్, రామచంద్రయ్య, ఈశ్వరయ్య, అజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఆవుల శేఖర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శిలు జాఫర్, వేమ య్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శిలు నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, సంజప్ప, కేశవరెడ్డి, రామకృష్ణ, కాటమయ్య, రాజేష్, సిపిఐ తా లూకా అధ్యక్షులు నాగరాజు, కణేకల్లు గౌస్ పీర్, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, కొత్తపల్లి మహేంద్ర, ఎర్రగుంట్ల వెంకటే షులు, సంజప్ప, కేశప్ప, నవీన్, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

# సాయి సన్నిధిలో సమ్మోహన సంగీతం

పుట్టపర్తి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త
ఆధ్యాత్మిక క్షేత్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిల యంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో సాయి విద్యార్థులు ప్రదర్శించిన సంగీత కచేరి భక్తులను సమ్మో హితులు చేసింది. సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ చెందిన 10 నుండి 12 తరగతులకు చెందిన విద్యార్థులు బహుచక్కటి స్వరాలతో సోమవారం సాయంత్రం భగవాన్ బాబావారిని కీర్తిస్తూ నిర్వహిం చిన ఈ సంగీతక కచేరి ఆద్యాంతం భక్తులను పరవశింప జేసింది. అంతకుము ను పు ఆల్ ఇండియా సెంట్రల్ బోర్డ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేష న్ 2020, 2021, 2022 సంవత్స రాలలో నిర్వహించి పబ్లిక్ పరీక్షల యందు ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. అనంతరం విద్యార్థులు భగవాన్ సత్యసాయి బాబా మహా సమాధిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు.



ట్రోఫీని అందిస్తున్న శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్‌ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్



సాయికుల్వంత్ హాలులో సంగీత కచేరీ నిర్వహిస్తున్న సాయి విద్యార్థులు

# నూతన డిఈఓకు శుభాకాంక్షలు వెల్లువ







బాధ్యతలు స్వీకరించిన డిఈఓకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యాలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
అనంతపురం జిల్లా విద్యాశాఖ అధి కారి బాధ్యతలు స్వీకరించిన యం. సాయిరాంని సోమవారం పలు ఉపా ధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశ్యారు. అందులో భాగంగా అపుస్మా జిల్లా అధ్యక్షులు కె.పుల్లారెడ్డి ఆధ్వర్య ంలో నాయకులు డిఈఓని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేశారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ హెచ్‌ఎం, ఎంఈఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్; అనంతపురం జిల్లా అధ్యక్షులు తారా చంద్రనాయక్ కూడా డీఈఓని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ఆధ్వర్యంలోకూడా డీఈఓని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారి సంఘం డెరీని కూడా అందజేశారు. వీరితోపాటు పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సచివాలయాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్

చిలమత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
మండలంలోని టేకులోడు, దేమకేతేపల్లి-1, దేమకేతేప ల్లి-2 సచివాల యాలను సోమవారం సత్య సాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ సంద ర్శించారు. ఈ సందర్భ ంగా ఆయన సిబ్బందికి ఈ సర్వీసె స్, ఈ గ్రామ్, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, ప్రయారిటీ బిల్డింగ్ నిర్మాణాలు పూర్తి చేయుట, హౌసింగ్ పురోగతి, సచివాల యాల సిబ్బంది నిర్వహించాల్సిన రిజిస్ట్రేషన్లు, రికార్డులపై తగు సూచనలు ఇచ్చారు. సచివాలయం సిబ్బంది తమ పని తీరును ఇంకను మెరుగుపరుచు కోవాలని ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి తరుచూ సచివాలయాల్లో సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకొనుటకు సచివాలయాలను తరుచూ సందర్శిస్తుండాలని ఆయన ఆదే శించారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు ఆయా శాఖల నివేది కలను కలెక్టర్‌కు అందచేశారు.

## రికవరీ ఫోన్లను అందజేసిన ఎస్పీ



రికవరీ ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
అనంతపురం జిల్లా పోలీసులు ఈ వారం రోజుల్లో 95 ఫోన్లను రికవరీ చేశారు. ఇతర రాష్ట్రాలకు డోర్ డెలివరీ, కొరియర్‌గా 2 ఫోన్ల ను అంద జేశారు. ఇప్పటి వరకు ప్రొఫెషనర్ కొరియర్ సహ కారంతో ఇతర రాష్ట్రాల/ప్రాంతా ల ప్రజలకు ఉచితంగా డోర్ డెలి వరీ ద్వారా అందజే సిన మొబైల్ ఫోన్లు 69, జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి ఈ సేవలను ప్రారం భించినప్పటి నుంచి 5,222 ఫోన్లను అందజేశారు. వీటి విలువ దాదాపు 8.48 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, టెక్నికల్ విభాగం ఎస్సై సుధాకర్‌యాదవ్, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి రికవరీ చేసిన మొబైల్‌ఫోన్లను అందుకునేందుకు వచ్చిన బాధిత ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా శివ పూజ

శింగనమల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
శింగనమల మండల కేంద్రంలోని శివమాల వేసిన స్వాములు సోమవారం మాగమాసంలో భక్తి శ్రద్ధలతో శివనామస్మరణ చేసుకుంటూ 41 రోజులు కఠో ర నియమ నిష్టలతో పూజా కార్యక్రమం ఆదినారాయణ గృహంలో నిర్వ హిం చారు. పూజా కార్యక్రమాలు అనంతరం శ్రీశైలం భ్రమరాంబ మల్లికా ర్జున స్వామి దర్శనం కోసం జోతిర్ముడి ఏర్పాటు చేసుకుని బయల్దేరారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శివదీక్ష వల్ల మనుషుల్లో ప్రశాంతత, నియ మ నిబంధనలు పాటించడం జరుగుతుందని మనిషి జీవితంలో ఎంతో ఉప యోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శివభక్తులు నారాయణ స్వా మి, బెస్తమధు, వడ్డేరాజు, మురళీ, నవీన్, శివ, అఖిల్, హర్ష, చిన్న కుళ్లా యప్ప, నందిని తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శివుడు



పూజలు చేస్తున్న శివమాల ధారులు

# ప్రామాణికంగా క్రియాశీలక సభ్యత్వం

**- జనసేన క్రియాశీలక సభ్యులకు ఐదు లక్షల ప్రమాద భీమా - రాష్ట్రంలోనే అనంతను గ్రస్థానంలోనిలుపుదాం**
**- సభ్యత్వ నమోదును ప్రారంభించిన జనసేన జిల్లా అధ్యక్షులు అర్బన్ ఇన్‌చార్జ్ టిసి వరుణ్**



మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు అర్బన్ ఇన్‌చార్జ్ టిసి వరుణ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఎంతో ప్రామాణికం సంత రించుకుని ఉందని, ప్రతి కార్యకర్తలు కుటుంబ సభ్యునిగా భావించే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ సభ్యత్వం ద్వారా ఐదు లక్షలు ప్రమాద భీమా వర్తించేలా కృషి చేయడం కార్యకర్తల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని జనసేన జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టిసి వరుణ్ అన్నారు. జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాందెండ్ల మనోహర్, సభ్యులు నాగరాజు ఆదేశాల మేరకు సోమవారం సప్తగిరి సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రార ంభించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. ప్రతి జన సైని కుల్లో భరోసా కల్పించడానికి ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5లక్షల భీమా.. ప్రమాదంలో గాయ పడితే 50 వేల రూపాయలు ఆసుపత్రి ఖర్చు లు పార్టీ నుంచి సహాయం చేసేలా చూస్తారని తెలియ జేశారు. క్రియాశీలక సభ్యత్వ కఆర్యక్రమం ఈ నెల ఫిబ్రవరి 10 నుంచి 28 వరకు ఉంటుందని తెలిపారు. అదే విధంగా పవన్ కళ్యాణ్ భావజాలం అనుసరించే ప్రతి ఒకరూ క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం నవెదు చేసుకునేందుకు కావలసినటు వంటి ఆధార్ కార్డు, పాస్‌ఫోటో, నామిని ఆధార్‌తోపాటు రూ. 500 సభ్యత్వ రుసు ము చెల్లించాలన్నారు. కార్యక్ర మంలోనగర అధ్యక్షులు పొది లి బాబురావు, జిల్లా ఉపాధ్య క్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కుమ్మర నాగేంద్ర, జిల్లా సంయుక్త కార్యదర్శిలు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శిలు మేదర వెంక టేష , రొళ్ల భాస్కర్, వెంకట నారాయణ, చక్రపాణి, హుస్సేన్, దరాజ్‌బాషా, నగర కార్యదర్శిలు లాల్‌స్వామి, సంపత్, అజి, రాజేష్‌కన్నా, నగర సంయుక్త కార్యదర్శిలు వెంకటరమణ, నెట్టిగంటి హరీష్, పవన్‌కుమార్, నాయకులు వడ్డే వెంకటేష్, మధు, నజీమ్, హిద్దు, రహీం, సతీష్‌కుమార్, నౌషాద్, రుద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు వాలెంటీర్లు సచివాలయ కన్వీనర్లే రథచక్రాలు

**- ఏపి విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి**



మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
గార్లదిన్నె మండలం ఎగువపల్లి దగ్గర వైఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సచివాలయం కన్వీనర్లు, వాలెంటీర్లు, గృహ సారధుల శిక్షణ కార్యక్రమంలో ఏపి విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి, మాజీ ఎంపిపి తరిమెల ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం నేతలు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరైనా జనం వస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అన్నారు. దాన్ని కొనసాగించ లేకపోయారు. ఇప్పుడు లోకేష్ పాదయాత్ర అన్నారు. జనం లేక ఒకవైపు, ఈయన నడవలేని ఒకవైపు గందరగోళంగామారిందన్నారు. మరి డబ్బులు కొట్టుకుని రాష్ట్రానికి తెలుగుదేశం ఎంతో చేసిందని చెప్పుకు తిరుగుతున్నారు కదా..
మరి ఆ పార్టీకి 23 సీట్లే ఎందుకు వచ్చాయి..? అని ప్రశ్నించారు. జగనన్నకు ఎందుకు 151 వచ్చాయని అడిగారు. ఎందు కంటే నాయకుడు అన్న వా డిపై జనానికి నమ్మకం ఉం డాలి. అది చంద్రబాబు కోల్పో యాడు. జగనన్న నిల బెట్టుకు న్నాడన్నార. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ కనుం పల్లి నరేందర్‌రెడ్డి, ఎంపిపి వెం కట నారాయణ, జడ్పిటిసి సొపట్ల సంధ్యారాణి, సింగిల్ విండో ప్రెసిడెంట్, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'స్పందన' చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపండి

**- జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్‌సింగ్**



స్పందనలో ఫిర్యాదుల స్వీకరిస్తున్న ఎస్‌పి, ఎఎస్‌పిలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త
ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలతో ప్రజలు అందించే ఫిర్యాదులు చట్టపరిధిలో ఉంటే తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయం నం దు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌పి 23 ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులు అందించిన వివిధ రకాల సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు ఎస్‌పి అర్జీలను బదలాయించారు.ముఖ్యంగా సైబర్ క్రైంలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, ఉద్యోగ మోసాలు, అత్తారింటి/భర్త వేధింపులు, బెదిరింపులు, దాడులు వంటి పలు సమస్యలపై తమ ఫిర్యాదులను నేరుగా ఎస్‌పి అందజేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులకు ఎస్‌పి ఫోన్‌ద్వారా సంభాషించి పోలీస్ పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రామకృష్ణప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్‌బి సిఐ రవీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టపరంగా ప్రజా సమస్యలు పరిష్కరించండి

**- జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి**



పిటీషనర్ల సమస్యలను వింటున్న ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలు తమ బాధలు, సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని 76 పిటీషన్లు అందజేశారు. ప్రతీ పిటీషనర్‌తో జిల్లా ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## బై జూస్ ట్యాబులు వినియోగంపై పర్యవేక్షణ చేయండి

**- డిఈఓ యం.సాయిరాం ఆదేశం**

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం, ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 22301 విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందజేయడం జరిగింది. అఆగే 8వ తరగతి బోధించుచున్న ప్రతి ఉపాధ్యాయుడికి (40833మందికి) ట్యాబులను అందజేయడం జరుగుతుం దని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి రెగ్యులర్‌గా ట్యాబును ఉపయోగించుకునే విధానా న్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నేర్పించాలన్నారు.

## 25లోపు దరఖాస్తులను అందజేయండి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
టిసిసి-2023 డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు 2023 ఏప్రిల్ నెలలో జరుగుతాయని, టిసిసి అర్హత పరీక్షలు గుర్తించబడిన కేంద్రాలలో నిర్వహించబడుతుందని డిఈఓ సాయిరాం, ఏపి గోవింద నాయక్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. సంబంధిత వెబ్ సైట్‌లో ఈ నెల 9 నుంచే అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకుని, డౌన్‌లోడ్ చేసిన వెబ్ అప్లికేషన్ ఫారమ్‌ను చివరి తేది 25లోగా అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు.

## పాముకాటుకు గురైన అమర్‌నాథ్‌ను పరామర్శించిన ముంటిమడుగు కేశవరెడ్డి



బెస్త అర్‌నాథ్‌ను పరామర్శిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

శింగనమల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన బెస్త అమర్ నాథ్, ఆదివారం వ్యవసాయ ప నుల నిమిత్తం చేనుకు వెళ్లగా పా ము కాటు వేయడంతో వెంటనే వారి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటి మడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి బెస్త అమర్‌నాథ్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వైద్యులతో మాట్లాడుతూ.. అమర్‌నాథ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వారి వెంట టిడిపి నేతలు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప ఎం.ఆది నారా యణ, బండి పరుశురామ్, బెస్త నారాయణస్వామి, మహ్మద్‌గౌస్ తదితరులు ఉన్నారు.

# ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త
అనంతపురం నగరంలో ప్రభు త్వ జూనియర్ కళాశాల ఆవర ణంలో ఉన్న ప్రభుత్వ బిసి బా లుర కళాశాల వసతి గృహం (నార్పల)లో ముంబైలోని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎండి, సీఈఓ, సాహితీ గగన్ మహల్ సంస్థ అధ్యక్షులు, ప్రముఖ న్యాయ వాది జె.ప్రతాప్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ని సోమవారం అనంతపురం జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ప్లాం ట్‌ను కార్పోరేట్ సోషియల్‌రెస్పాన్సిబిలిటీ కేంద్ర సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సెంట్ బ్యాంకు హోంలోన్ ఫైనాన్స్ లిమిటెడ్ నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత మొక్కలు నాటారు. అదే విధంగా కేక్ కట్ చేశారు. విద్యార్థులతో డిడి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏబిసి డబ్ల్యూఓ సుభాషిని, స్థానిక హాస్టల్స్ వార్డెన్లు పాల్గొన్నారు.